# డబ్బు

రంగనాయకమ్మ

కోటి!

కోటి!!

ఏమిటి కోటి?

డబ్బు! ధనం! రూపాయలు!

కోటి రూపాయలు!!

ఆ విద్యాధికయువకుడు అడిగాడన్న

మాట - కట్నం!

కోటి రూపాయల కట్నం!!

ఆశ్చర్యంగా లేదూ?

ఏం ఆశ్చర్యంలే! ఇచ్చేవాళ్ళు వుంటే అడగడానికేం? ఒక్క కోటి ఏమిటి, రెండు కోట్లు అడగొచ్చు! నాలుగు కోట్లు అడగొచ్చు! వంద కోట్లయినా అడగొచ్చు! డబ్బుకి అంతం ఎక్కడ? అంకెలకి అంతం వుందా? ఇచ్చేవాళ్ళు వుంటే అడగడానికేం? అది కాదు ఆశ్చర్యం!

మరి, ఏమిటి ఆశ్చర్యం?

అంత కట్నం ఇస్తానన్నాడు - మామ! అదీ ఆశ్చర్యం! కోటి రూపాయల కట్నం కూడా, ఆశ్చర్యంకాని కట్నం అయిపోయినందుకే ఆశ్చర్యం! అదీ ఆశ్చర్యం!

అది మాత్రం ఏం ఆశ్చర్యంలే! కోటి రూపాయలు కట్నం ఇచ్చేవాడికి ఎన్ని కోట్ల ఆస్తి వుండి వుండాలి! ఆ కట్నదాత దశ కోటేశ్వరుడో, శత కోటేశ్వరుడో అయి వుంటాడు కదా? అందులో 'ఏక కోటి కట్నం' పారెయ్యడంలో ఆశ్చర్యం ఏముంది? అది కూడా కాదు నిజమైన ఆశ్చర్యం!

అయితే, ఏమిటి మరి నిజమైన ఆశ్చర్యం? ఆ యువతి సంగతే నిజమైన ఆశ్చర్యం. ఆమె కూడా అతనిలాగే చదువుకుంది. "ఇంత డబ్బు ఇస్తేనే నీతో జీవించడానికి ఒప్పుకుంటా" అనే మనిషితో జీవించడానికి ఒప్పుకున్న ఆ యువతితోనే అసలైన ఆశ్చర్యం!

"బాగా చదువుకున్న" యువకుడు కూడా కట్నం అడిగాడు!

"బాగా చదువుకున్న" యువతి కూడా దానికి అంగీకరించింది!

అతని చదువునీ, ఆమె చదువునీ పక్కన పెడితే, అతడూ, ఆమే మిగులుతారు.

అతడు పురుషుడు! ఆమె స్త్రీ!

పురుషులు కట్నాలూ, కానుకలూ అడుగుతారు. స్త్రీలు, వాటిని సమర్పించుకుంటారు! ఇక్కడ కూడా అదే సత్యం మిగిలినందుకే ఆశ్చర్యం! చదువుల్లో, పుస్తకాల బరువు తప్ప, ఏమీ లేనందుకే ఆశ్చర్యం!

"కట్నం తీసుకోవాలా, మామగారి ఆస్తిలో వాటా తీసుకోవాలా?" అని అల్లుడు చాలామంది పెద్ద మనుషులతో ఆలోచనలు చేశాడు.

"ఏది ఎక్కువైతే అది తీసుకో" అన్నారు తెలివైన వాళ్ళు. అంతేగా మరి!

"మామా! ఏది ఎక్కువ?" అని అడిగాడు అల్లుడు, మామని.

"ఆస్తిలో వాటా అయితే పది రూపాయలు ఎక్కువే. కానీ..." — మామ!

"కానీ...? ఊ... కానీ?"

"కట్నమే మన సాంప్రదాయం."

"సాంప్రదాయం కోసం పది రూపాయలు వొదులుకోవాలా మామా?"

తెలివైన ఒకానొక పెద్దమనిషి 10 రూపాయల కోసం అల్లుడు తెచ్చుకోబోతోన్న ప్రమాదాన్ని పసిగట్టి — "ఆస్తిలో వాటా అయితే, ఆ ఆస్తి అంతా నీ భార్య పేరనే వుంటుంది. కట్నం అయితే నీ చేతిలోకి వస్తుంది—" అని తన తెలివినంతా ప్రదర్శించాడు.

"నా భార్యే నా చేతిలో వుండగా, భార్య ఆస్తి నా చేతిలో వుండదా?" అని అల్లుడు నిస్తుబోతూ మరింత తెలివైన ప్రశ్న విసిరాడు.

"చెప్పలేం. కాలం మారిపోతోంది!"

"కాలం మారిపోతోందా? అంత మారిపోతోందా? నా భార్య నా చేతిలో వున్నా, ఆమె ఆస్తి మాత్రం నా చేతిలో వుండనంత మారిపోతోందా కాలం?"

"నీ భార్యే నీ చేతిలో వుండనంత మారిపోతోంది!"

"ఓహో! అలాగా! ... అయితే ఏం చెయ్యాలి?" — ఆందోళన చెందాడు అల్లుడు.

"10 రూపాయలు తక్కువైతే అయింది, కట్నమే తీసుకో. ఆస్తిలో వాటా జోలికి పోకు. అది మొగాడికి తెలివైన పని కాదు."

ఆ తెలివైన సలహా అల్లుడికి బాగానే నచ్చింది. కానీ, 10 రూపాయల నష్టం భరించడమా? అదే అతని సమస్య. ఈసారి తన స్వంత తెలివి మీదే ఆధారపడదలిచాడు. తెగ ఆలోచించి చివరికి "ఆ 10 రూపాయలు కూడా వదులుకోను" అని ప్రకటించాడు.

"ఏం చేస్తావు? ఎలా సంపాదిస్తావు?" అని తెలివైన పెద్ద మనిషి కూడా తెలివి తక్కువ మొహం వేశాడు.

"చూడు, ఏం చేస్తానో...! మామా! ఆ 10 రూపాయలు కూడా కొసరు వేసేసి 'కోటీ పది రూపాయలు' ఇచ్చెయ్యి! లేకపోతే..."

"ఊ... లేకపోతే?" — మామ!

"ఇంకో సంబంధం చూసుకోక తప్పదు మీరు."

"వొద్దొద్దు. అంతమాట అనొద్దు. పదిమందిలో నన్ను అప్రతిష్టపాలు చెయ్యొద్దు—" అని అరిచి మామ అన్ని షరతులకీ వొప్పేసుకున్నాడు.

సంబంధం కుదిరిపోయింది!

"అల్లుడూ! 'డబ్బు'ని రొఖ్ఖంగా చూడడం నాకు ఎంతో ఆనందం. కోటి రూపాయల రాసిని కళ్ళారా చూస్తే ఎంత బాగుంటుందో. ఎప్పుడైనా చూశావా?"

"లేదు మామా! ఎప్పుడూ చూడలేదు. 'కోటి' అన్నావేమిటి? 'కోటీ పది' కదా? మాట మార్చగూడదు సుమా!"

"లేదు. మాట మార్చేది లేదు. డబ్బంతా బ్యాంకులో పడేసి చెక్కు ముక్క నీ చేతికి ఇస్తే నాకు ఇచ్చినట్టూ వుండదు, నీకు తీసుకున్నట్టూ వుండదు. డబ్బంతా రొఖ్ఖంగా నీ చేతికిచ్చేస్తాను, తీసుకో."

"అలాగే. అప్పుడు ఇన్‌కమ్‌ టాక్స్‌వాళ్ళకి లెక్కలు చెప్పక్కర్లేదు కూడా"

"అదే మరి లాభం. అడుగడుగునా ఏది లాభమో ఆలోచిస్తూ వుండాలి. ఇంకో మాట విను. డబ్బుని బస్తాలతో చూసుకోవడం నాకు చాలా ఇష్టం. ఎప్పటినించో 10 పైసల బిళ్ళలు పోగేస్తున్నాను. అదో సరదా నాకు. కోటి రూపాయల 10 పైసల బిళ్ళలు! ఎన్ని బస్తాల డబ్బో! ఒక షెడ్డునిండా పెట్టించాను బస్తాలు. చూడాలంటే రెండు కళ్ళూ చాలవు."

"నాకు చూపిస్తావా మామా! ఎంత బాగుంటుందో!"

"ఆ బస్తాలన్నీ నీకే. నీ కట్నం!"

"అన్ని బస్తాలా? లెక్కంతా బాగా పెట్టారా?"

"పెట్టారు. పనివాళ్ళే లెక్కపెట్టి బస్తాలు కట్టారు."

"పనివాళ్ళు లెక్కపెట్టారా? వాళ్ళని నమ్మలేం. వాళ్ళకసలు లెక్కలు రావు కూడా!"

"పోనీ ఒక బస్తా ఎక్కువే వేయిస్తాలే. నీ కళ్ళ ముందే తూకం వేయిద్దాం."

"వొద్దొద్దు. తూకంలో చాలా మోసాలు వుంటాయి."

"అయితే నువ్వే లెక్కపెట్టుకుంటావా?"

"ఆ , అదీ, అలాగే చేస్తాను. లెక్క ఇప్పుడు మొదలు పెట్టెయ్యనా? రెండు రోజుల్లో అయిపోదూ?"

"ఇప్పుడు కాదయ్యా! పెళ్ళయిన తర్వాత లెక్కపెట్టుకో."

"మరి పెళ్ళయిపోయాక, లెక్క తక్కువొస్తే..."

"తక్కువ అయినదానికి రెట్టింపు ఇస్తాను, సరేనా?"

"...సరే... సరే. డబ్బు బస్తాల షెడ్డు తాళం ఇప్పుడే నాకిచ్చెయ్యండి. నా దగ్గిరే పెట్టుకుంటాను."

"మా అమ్మాయి దగ్గిర వుందిలే."

"వొద్దు. ఆ అమ్మాయి పెళ్ళి ముస్తాబులో పడి తాళం ఎక్కడన్నా పారేస్తుంది. నాకిచ్చెయ్యండి ఇప్పుడే."

"సరే, నీ ఇష్టం."

* * *




2-6-89 ఆంధ్రజ్యోతి వారపత్రిక

పెళ్ళికొడుకు, పెళ్ళి బట్టలతో పీటల మీద నుంచి లేవగానే షెడ్డు వేపు పరుగెత్తి డబ్బు లెక్క మొదలు పెట్టాడు. ఆ క్షణం నుంచీ అతనికి ప్రపంచమంతా అంతర్థానమైపోయింది, ఆ నాణాలు తప్ప! సూర్యోదయాలూ, చంద్రోదయాలూ, పౌర్ణములూ, అమావాస్యలూ, ఋతువులూ, కాలాలూ మొత్తం ప్రకృతే అంతర్థానమైపోయింది!

కాలచక్రం దొర్లిపోతూనే వుంది!

* * *

అతను చివరి బస్తా లెక్క పూర్తిచేసేటప్పటికి ఇరవై నాలుగు సంవత్సరాలు గడిచాయి! లెక్క పూర్తిచేసి కోపంతో వూగిపోతున్నాడు. "40 పైసలు తగ్గింది! ఎంత మోసం! ఒక బస్తా డబ్బు ఎక్కువ వేశావన్నాడు. అంతా దగా, మోసం! బుద్ధి చెపుతాను. కాళ్ళు పట్టుకునే లాగ చేస్తాను" అని గంతులేస్తూ వెనక్కి తిరిగాడు.

అక్కడ ఇద్దరు స్త్రీలు నిలబడి అతన్ని వింతగా చూస్తున్నారు. ఒక స్త్రీకి నలభై అయిదేళ్ళు దాటి వుంటాయి. ఆమె పక్కన, కొంచెంగా ఆమె పోలికలతో ఆమె కూతురిలాగ కనిపిస్తోంది, రెండో స్త్రీ.

లెక్కల పెళ్ళికొడుకు ఆ పెద్ద స్త్రీని కొంచెం అనుమానంగా చూశాడు, ఎక్కడో ఏదో వచ్చీరాని జ్ఞాపకాలతో.

"నేను... పెళ్ళి... నువ్వేగా?"

"అవును."

"అయితే, నేను నిన్ను ఏలుకోను!"

"అలాగా? ఎందుకూ?"

"మీ నాన్నని పిలువు. ఎందుకో చెపుతాను. ఇంత మోసం చేస్తాడా?"

"ఏం మోసం చేశాడు?"

"40 పైసలు తగ్గింది."

"లెక్కపెట్టడంలో కొంచెం పొరపాటు జరిగివుంటుంది."

"కాదు, పనివాళ్ళు కొట్టేసి వుంటారు."


"కాదు, వాళ్ళు తీసుకోదలిస్తే ఇంకా చాలా డబ్బు తీసుకునేవారే. లెక్కలో పొరపాటే అది."

"ఇప్పుడు ఎవడు భరిస్తాడీ 'పొరపాటు'? పిలూ నీ బాబుని."

"ఆయన పోయి ఐదేళ్ళయింది."

"పోయాడా? నాకు చెప్పకుండానే!"

"నీకు చెప్పకుండా చాలా విషయాలు జరిగిపోయాయి. పెళ్ళయిన తక్షణం నువ్వు డబ్బు లెక్కల్లో కూరుకుపోయావు. నీ కోసం నేను రెండు సంవత్సరాల వరకూ ఇక్కడికి తిరిగాను. నీతో ఈ లెక్కలన్నీ మాన్పించాలని చాలా ప్రయత్నించాను. నీతో మాట్లాడాలని నేను ఎప్పుడు వచ్చినా నువ్వు చెయ్యి అడ్డం పెట్టి 'అడ్డం రాకు, అడ్డం రాకు, లెక్క పాడైపోతుంది' అని కోపంగా చూసేవాడివి. నేను చేసిన తప్పేమిటో తొందరగానే నాకు అర్థమైంది. నీ ధోరణి చూసి చూసి నీ మీద ఇష్టమంతా నశించింది. నీతో జీవితం కన్నా మరణం మేలనే నిర్ణయానికి వచ్చేశాను. నా అదృష్టవశాత్తూ, ఈ నాటికీ నా భాగ్యమనిపించే వ్యక్తి నా జీవితంలోకి వచ్చాడు. అతనితో పెళ్ళికి మొదట మా నాన్న ఒప్పుకోలేదు. నా



నాన్న చెప్పినట్టు లోపం అంతా ఇంత డబ్బు ఒక మనిషి దగ్గర చేరడంలోనే వుందమ్మా. తాతయ్యకి ఇంత డబ్బు ఎలా వచ్చింది? కట్నం అడిగే మనిషితో జీవించడానికి ఒప్పుకోకూడదంటావు నువ్వు అసలు డబ్బున్న మనిషితో జీవించడానికి కూడా ఒప్పుకోకూడదమ్మా

నిర్ణయం గట్టిగా చెప్పేసరికి ఆయన కూడా అంగీకరించాడు. డబ్బు మాటలు లేకుండా మా పెళ్ళి జరిగిపోయింది. ఆ సంగతి నీకు చెపుదామని ఆ రోజుమళ్ళీ వచ్చాను. నన్ను అంత దూరంలో చూడగానే "నువ్వు రాకు, రాకు, రాకు. లెక్క జాగ్రత్తగా చూసుకోవాలి. అడ్డం రాకు" అని కళ్ళెర్రజేసి కోపంగా చూశావు.

రెండేళ్ళకి మాకీ అమ్మాయి పుట్టింది. అప్పుడైనా చెపుదామని నీ దగ్గరికి మళ్ళీ వచ్చాను.

"లెక్క... అడ్డం రాకు. అడ్డం రాకు" అని విలవిల్లాడుతూ, చేతులు అడ్డంగా తిప్పావు.

సరే, నీ లెక్కంతా పూర్తిఅయ్యాకే వచ్చి చెపుదామని ఇన్నాళ్ళూ ఆగాను. 24 సంవత్సరాలు గడిచాయి."

"24 సంవత్సరాలా?!"

"అవును! 24 సంవత్సరాలు! మనిషి జీవితంలో మూడోవంతు కాలం! మన పెళ్ళినాడు జీవించి వున్న పెద్దవాళ్ళు చాలా మంది మరణించారు. ఈ రాష్ట్రంలో 5 ప్రభుత్వాలు మారాయి. మా అమ్మాయి కాలేజీ చదువు పూర్తిచేసింది. మా పుట్టింటివాళ్ళకి వ్యాపారంలో బాగా నష్టం వచ్చి ఆస్తి అంతా నాశనమయింది. ఆ బెంగతోనే మా నాన్న పోయాడు. ఆస్తి మీద ఆశలులేని నేనూ, నా భర్తా మొదటి నించీ సంతోషంగా వున్నాము. మా వుద్యోగాలతో మేము జీవిస్తున్నాము. నా జీవితం ఇలా మలుపు తిరగకుండా, నీతోనే ముడిపడివుంటే, నా కళ్ళు ఈనాటికీ తెరుచుకునేవి కావు. ఈ డబ్బంతా, మళ్ళీ మన పిల్లకి కట్నంగా ఇవ్వడం గురించే ఆలోచిస్తూ వుండేదాన్ని. కానీ, ఈనాడు, 'కట్నం' అనే మాట నా చెవులకి భరించలేనంత దుర్భరం. 'సతి', 'చెర', 'వురి' అనే మాటలు వుంటాయే, అంత దుర్భరం! మన చరిత్రంతా ఈ అమ్మాయికి చెప్పాను. ఇరవై నాలుగేళ్ళ నించీ డబ్బు లెక్కలు పెట్టుకుంటూ వున్న మనిషిని చూస్తానని ఈ అమ్మాయి ఆశ్చర్యపడుతూ వచ్చింది. మా నాన్న నీకు ఈ డబ్బు ఇవ్వకుండా వుంటే, మా నాన్నే కాదు ఎవ్వరూ నీకు కట్నం ఇవ్వకుండా వుంటే నీ జీవితం చాలా సహజంగా నడిచేది. ఈ డబ్బు కోసం జీవితంలో ఎంత సహజత్వం పోగొట్టుకున్నావో నీకు అర్థమైనట్టు లేదు. ఈ మాటలన్నీ నీతో అనాలని ఎంతకాలం నించీ ఎదురు చూస్తున్నానో! నిన్ని ప్రమాదంలో నుంచి బయటికి లాగాలని ఎన్నిసార్లు ప్రయత్నించానో! నన్ను చూసీ చూడగానే నువ్వు 'డబ్బు లెక్క' తప్పిపోతుందని గాభరా పడేవాడివి. జీవిత మార్గమే తప్పిపోయిందనే సంగతి నీకు పట్టలేదు. పోనీలే, ఇప్పటికైనా నీ డబ్బు లెక్క ముగిసింది. ఇప్పటికైనా నేను చెప్పాలనుకున్న మాటలన్నీ చెప్పినందుకు సంతోషిస్తున్నాను."

"హు! సంతోషం! ఎవరికి సంతోషం? 40 పైసలు తగ్గింది. తగ్గిందానికి రెట్టింపు ఇస్తానన్నాడు మీ నాన్న. అన్నీ దొంగ మాటలే. ఇప్పుడు ఎవడిస్తాడు నా 80 పైసలు?"

స్త్రీలిద్దరూ వెనక్కి తిరిగారు.

"మూర్ఖుడు!" — అంది కూతురు.

"అనాడు సగం తప్పు నాది కూడా. నాతో జీవించడానికి డబ్బు ఇవ్వాలని అడిగినవాడితో జీవించడానికి నేనెలా ఇష్టపడ్డానో ఇప్పుడు అర్థం కాదు. నా తల్లిదండ్రులు నా కోసం ఇంత కట్నం ఇస్తున్నారని సంతోషించానేగానీ అంతకన్నా ఆలోచించలేకపోయాను."

"నీ పొరపాటు నువ్వు తెలుసుకున్నావు కదా? అతను కూడా అలాగే తెలుసుకోవచ్చు. కానీ, ఎందుకు తెలుసుకుంటాడు? అతను డబ్బు ఇచ్చిన మనిషి కాదు, తీసుకున్న మనిషి!"

"అందుకే అతను దానికి శిక్ష అనుభవించాడు. ఒక జీవిత కాలం పోగొట్టుకున్నాడు."

"నాన్న చెప్పినట్టు లోపం అంతా ఇంత డబ్బు ఒక మనిషి దగ్గర చేరడంలోనే వుందమ్మా! తాతయ్యకి ఇంత డబ్బు ఎలా వొచ్చింది? కట్నం అడిగే మనిషితో జీవించడానికి ఒప్పుకోకూడదంటావు నువ్వు. అసలు, డబ్బున్న మనిషితో జీవించడానికి కూడా ఒప్పుకోకూడదమ్మా! ఆస్తి వున్నప్పుడు, ఆస్తి లెక్కలు వుండవూ? నాన్న చెప్పినట్టు అసలు సమస్యంతా ఆస్తిలోనే వుంటుంది. ఆడపిల్లలు కట్నాలు ఇవ్వడం మానుకుంటే, అప్పటి నించీ వాళ్ళ ఆస్తుల లెక్కలు ప్రారంభమవుతాయి. ఆడపిల్ల వేపువాళ్ళు, మొగవాళ్ళవేపు ఆస్తుల గురించి తెలుసుకోడం లేదూ? ఆస్తుల్ని చూసి సంబంధాలు కుదుర్చుకోడం లేదూ? ఇదీ అలాగే. కట్నాల బేరాలన్నీ ఆస్తి లెక్కలుగా మారతాయి. అంతేకదా తేడా? ఆస్తులు వున్న మనుషుల జీవితాల్లో ఏముంటుందమ్మా, ఆస్తుల లెక్కలు తప్ప? పది పైసల బిళ్ళలు కాకపోతే, పది రూపాయల నోట్లు లెక్కలు పెడతారు, వందరూపాయల నోట్లు లెక్కలు పెడతారు. ఇరవై నాలుగు సంవత్సరాలు కాకపోతే ఇరవై నాలుగు గంటలు లెక్కలు పెడతారు. అంతేకదా తేడా? ఆస్తులు వున్నవాళ్ళ జీవితాల్లో ఎప్పుడూ డబ్బు లెక్కలే కదా? నేనైతే కట్నం తీసుకునే మనిషినే కాదు, ఆస్తి వున్న మనిషిని కూడా ప్రేమించలేను."

*

తదుపరి సీరియల్స్!

* జడలో జాబిలి

* పార్ట్ టైమ్ హజ్బెండ్

* నరనారాయణులు

మరియు

* శైలకుమార్ "డ్రీమ్ గర్ల్"

పోస్ట్ మార్టమ్ కథలు

మాట్లాడని శవం చేత మరణ రహస్యం చెప్పించేదే పోస్ట్‌మార్టమ్!

డాక్టర్ జి. సమరం

అతి త్వరలో

## కొత్తరకం దిండు

హాయిగా నిద్రపోవాలంటే పక్క కన్నా ముందు తలగడ దిండు చాలా అవసరం. మెత్తటి దిండు ఇచ్చే సుఖం ఎంతని చెప్పాలి? ఆ ఆనందమే వేరు. అలాగని చెప్పి ఎక్కడపడితే అక్కడ ఎవరి దిండు మీదైనాసరే తల వాల్చేస్తే ఆ తరువాత మనం తల పట్టుకొని కూర్చో వాల్సి వస్తుంది. ఎందుకో తెలుసా? మన తలలో సడన్‌గా దురదలు రావచ్చు. సూక్ష్మక్రిములు చేరవచ్చు. ఇలా ఎన్నని చెప్పమంటారు? ఇటువంటి ఇబ్బందుల్ని దూరం చేయడానికే పియుఆర్ పోలియు రథన్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఒక వినూత్నమైన తలగడ దిండు 'పోస్చర్ పిల్లో'ను తయారుచేసింది. దీనిపై తల పెట్టి పడుకుంటే దురదలు రావు. అసలు బాక్టీరియాలే ఈ దిండు దరి చేరవు.

వైద్యశాస్త్ర సూత్రాల ప్రకారం తయారుచేసిన ఈ దిండును వీపుకు ఆనించుకుని ఎంచక్కా కూర్చో వచ్చు. ఇతర కుషన్, ఫోమ్ దిండ్ల వల్ల వచ్చే నడుం నొప్పులు, వెన్నెముక నొప్పి ఈ దిండు వాడితే అసలు రానేరావట. ఎంతటి ఉష్ణోగతనైనా తట్టుకోగలిగే ఈ దిండు ధర కేవలం 120 రూపాయిలు - నష్టాలు అదనం!

-కిసూ

